JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 03-11-2025
Medchal - Malkajgiri । Monday 03-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 157 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 157 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## ఇస్రో ఖాతాలో మరో ఘనత

- బాహుబలి రాకెట్ లాంఛ్ సక్సెస్ !
- భారత నావికాదళం కు బలమిచ్చే CMS-03 ఉపగ్రహం
- రియల్-టైమ్ కమ్యూనికేషన్ సేవలు
- ISRO శ్రీహరికోటలో LVM3-M5 ద్వారా 4,410 కిలోగ్రాముల CMS-03 శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఇది భారత నావికాదళం కోసం కీలక కమ్యూనికేషన్ సేవలు అందిస్తుంది.

**జయభేరి, శ్రీహరికోట :**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో చరిత్రాత్మక విజయం సాధించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్ సీఎంఎస్03 ను, శక్తివంతమైన LVM3M5 రాకెట్ సహాయంతో విజయవంతంగా కక్ష్య లో ప్రవేశపెట్టింది. శ్రీహరికోట లోని సతీష్ ధవణ్ అంతరిక్ష కేంద్రం నుంచి ఆదివారం సాయంత్రం 5:26 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. 4,410 కిలోగ్రాముల బరువు ఉన్న ఈ ఉపగ్రహం, భారత్ ప్రయోగించిన కమ్యూనికేషన్ శాటిలైట్‌లలోకెల్లా అత్యంత బరువైనదిగా నిలిచింది. ఈ విజయం భారత అంతరిక్ష రంగం లో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావించవచ్చు. చంద్రయాన్3 మిషన్ తర్వాత LVM3 రాకెట్ సాధించిన ఈ ఘనత, భారత స్వావలంబన సామర్థ్యం మరింత బలోపేతం చేసింది. ఈ ప్రయోగం సమయం లో వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో అన్ని వ్యవస్థలు సజావుగా పనిచేశాయి.

...మిగతాది 3 లో



## ప్రజల కోసం అయితే పేదల ఇళ్లు ఎందుకు కూల్చుతున్నారు?

- కేటీఆర్ హైడ్రా ఇళ్ల కూల్చివేతలపై కాంగ్రెస్, రాహుల్ గాంధీని ప్రశ్నించారు. పేదల ఇళ్ల పై చర్యలు, పెద్దల ఇళ్ల కు మినహాయింపు అంటూ ద్వంద్వ న్యాయాన్ని విమర్శించారు.

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో హైడ్రా పేరుతో జరుగుతున్న ఇళ్ల కూల్చివేతలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఆయన కాంగ్రెస్ పార్టీని, ముఖ్యంగా రాహుల్ గాంధీని నేరుగా ప్రశ్నిస్తూ, "యూపీలో బుల్డోజర్ రాజకీయాలను వ్యతిరేకిస్తానని చెప్పే రాహుల్ గాంధీ, తెలంగాణలో పేదల ఇళ్లు కూల్చే హైడ్రా చర్యలపై ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు?" అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు ఒక విధానం, ధనవంతులకు మరో విధానం అనుసరిస్తోందని విమర్శించారు. ఇది నిజమైన ప్రజా పాలన కాదని, పేదల పట్ల అన్యాయం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి బాధలను నేరుగా విన్నారు. ఈ సందర్భంగా హైడ్రా ప్రాజెక్ట్ పని తీరుపై సవివరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. “హైడ్రా నిజంగా ప్రజల కోసం చేస్తే, పేదల ఇళ్లను కూల్చడం అవసరమా? ఫైవ్ స్టార్ హోటళ్లలో మీటింగులు పెట్టి, పేదలపై బుల్డోజర్లు నడపడం వెనుక ఉన్న నిజమైన ఉద్దేశ్యం ఏమిటి?” అని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. “ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, పేదల ఇళ్లను కూల్చేటప్పుడు ఎందుకు పెద్దల ఇళ్లను

...మిగతాది 2 లో

## చరిత్ర సృష్టించిన భారత వనితలు

- మహిళల ప్రపంచకప్ టైటిల్ టీమిండియాదే..
- భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ముంబైలో జరిగిన వరల్డ్ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి.. తొలిసారిగా విశ్వ విజేతలుగా నిలిచింది. ఈ మ్యాచులో సఫారీలను 52 రన్స్‌తో ఓడించింది. 2005, 2017 ఫైనల్స్‌లో చేజారిన కలను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సాకారం చేసింది.



**జయభేరి, హైదరాబాద్ :**

కల నిజమైంది.. మహిళ క్రికెటర్లు చరిత్ర తిరగరాశారు. భారత మహిళల క్రికెట్ జట్టు ఐసీసీ వరల్డ్ కప్ ట్రోఫీని ముద్దాడింది. ముంబైలో జరిగిన ఫైనల్‌లో సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టిన భారత్.. ప్రత్యర్థి దక్షిణాఫ్రికాను చిత్తు చేసి తొలిసారి విశ్వవిజేతగా నిలిచింది. ఈ మ్యాచులో సఫారీలను 52 రన్స్‌తో ఓడించింది. 2005, 2017 ఫైనల్స్‌లో చేజారిన కలను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సాకారం చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసి దక్షిణాఫ్రికాకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ (87), స్మృతి మంధాన (45) జట్టుకు కళ్లుచెదిరే ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా షెఫాలీ మెరుపు బ్యాటింగ్‌తో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది.

...మిగతాది 2 లో

## రేవంత్ సర్కార్‌పై హైడ్రా అధికారుల కుట్ర




- సీఎం దృష్టికి తీసుకెళ్తా..

**జయభేరి, హైదరాబాద్ :**

హైడ్రా అధికారులపై కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా అధికారులు అత్యుత్సాహం చూపిస్తూ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. “ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కొంతమంది హైడ్రా అధికారులు చేస్తున్న కుట్రగా అనుమానం కలుగుతోంది. బీఆర్ఎస్‌కు లాభం చేసేందుకు వారు ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తుంది” అని ఆయన అన్నారు.

ఈ అధికారుల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరును ప్రతిపక్షాలు బలంగా జనంలోకి తీసుకెళ్తున్నాయని జగ్గారెడ్డి అన్నారు. తక్షణమే హైడ్రా చీఫ్ రంగనాథ్ ఈ అధికారులపై దృష్టి సారించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఓడించేందుకు కొంతమంది అధికారులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు హైడ్రా దాడుల గురించి మాట్లాడని కేటీఆర్, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రోజూ హైడ్రా జపం చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా దాడులను బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

**సీఎం దృష్టికి తీసుకెళ్తా..**

ఈ అంశాన్ని తాను త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. “అటువంటి అధికారుల కుట్రలకు అడ్డుకట్ట వేయాలి. ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, దీనిపై విచారణ కూడా జరపాలి” అని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా పనిచేసే హైడ్రా అధికారుల వల్ల నష్టపోయిన బాధితులు ఎవరైనా ఉంటే, వారిని తాను స్వయంగా వారిని కలిసి సమస్యలను తెలుసుకుంటానని స్పష్టం చేశారు.

## బీహార్‌ను మేడ్ ఇన్ ఇండియా హబ్‌గా మార్చడమే లక్ష్యం

- బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అరాలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీఏ ఎన్నికల మ్యానిఫెస్టో, బీహార్ అభివృద్ధి గురించి కీలక ప్రకటన చేశారు. ఢిల్లీలో ఉన్నవారు గాలి దిశను అంచనా వేయలేకపోతున్నారని, బీహార్ ప్రజలు ఎన్డీఏతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది నాటికి 10 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు.



**జయభేరి, న్యూఢిల్లీ:**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అరాలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీఏ ఎన్నికల మ్యానిఫెస్టో, బీహార్ అభివృద్ధి గురించి కీలక ప్రకటన చేశారు. ఢిల్లీలో ఉన్నవారు గాలి దిశను అంచనా వేయలేకపోతున్నారని, బీహార్ ప్రజలు ఎన్డీఏతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది నాటికి 10 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించడం జరుగుతుందని, దీని కోసం పూర్తి రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని భారత ప్రధాన మంత్రి

...మిగతాది 2 లో



## ఈ కేసులో నెక్స్ట్ టార్గెట్ ఎవరు?

- జోగి రమేష్ అరెస్ట్‌తో ఏపీలో పొలిటికల్ తుఫాన్..
- అది నకిలీ మద్యం కాదు.. స్లో పాయిజన్
- కల్తీమద్యం కేసులో జోగి రమేష్ అరెస్ట్‌తో ఏపీలో పొలిటికల్ తుఫాన్ రేగింది. ఆయన అరెస్ట్ అక్రమం అంటోంది.. వైసీపీ. కక్ష సాధింపేనని వాదిస్తోంది. అయితే.. ఫ్యాన్ పార్టీ నేతలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తోంది అధికార కూటమి. ఇంతకీ.. ఈ కేసులో నెక్స్ట్ టార్గెట్ ఎవరు?

కల్తీమద్యం కేసులో జోగి రమేష్ అరెస్ట్ తో ఏపీలో పొలిటికల్ తుఫాన్ మొదలైంది.. జోగి రమేష్ అరెస్ట్ పై వైసీపీ అధినేత స్పందించారు. రమేష్ ను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో

...మిగతాది 3 లో

## ఆలయంలో ప్రత్యేక పూజలు

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కొండంతా భక్తజనంతో నిండిపోయింది. కార్తీకమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనార్థం యాదగిరిగుట్టకు భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులతో యాదగిరి కొండతో పాటు పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి.



**జయభేరి, యాదగిరిగుట్ట:**

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, గదుల విచారణ కార్యాలయం కల్యాణకట్ట, పుష్కరిణి, అన్నదాన సత్రం ప్రాంతాల్లో ఎటుచూసినా భక్తుల రద్దీ ఉండడంతో సందడిగా మారాయి. స్వామి, అమ్మవార్ల సర్వ దర్శనానికి 5 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు అధికారులు

...మిగతాది 2 లో

## అవమానించిన చోటే గెలుపు పిలుపును వినిపించింది

పేజీ 2

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రజల కోసం అయితే...

వదిలేస్తోంది? న్యాయం అందరికీ సమానంగా ఉండాలిగానీ, కాంగ్రెస్ పాలనలో అది కేవలం పేదలకే కఠినంగా కనిపిస్తోంది," అని ఆయన అన్నారు. పెద్దలకు, మంత్రులకు, నేతలకు నోటీసులు కూడా ఇవ్వకుండా వదిలేయడం కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని బయటపెడుతోందని విమర్శించారు. తన ప్రసంగంలో కేటీఆర్ గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత భట్టి విక్రమార్క హైడ్రా ప్రాజెక్ట్‌ను గొప్పదిగా చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. "భట్టి విక్రమార్క గారు హైడ్రా చాలా గొప్పగా పనిచేస్తోందన్నారు. కానీ ఇప్పుడు అదే హైడ్రా పేదల ఇళ్లకు మాత్రమే ఎందుకు వెళ్తోంది? పెద్దల బంగ్లాలు, ఫార్మ్‌హౌసులు, హోటళ్ల దిశగా ఎందుకు వెళ్లడం లేదు?" అని ప్రశ్నించారు. కేటీఆర్ హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు. "పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేయడం రాజకీయ ప్రతీకారమే. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటే ఒక్క ఇల్లు కూడా తాకించేదేమీ కాదు," అని ఆయన అన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారిని ధైర్యం చెప్పిన కేటీఆర్ ప్రభుత్వం తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

అలాగే, కేటీఆర్ మాట్లాడుతూ, "ఇది ప్రభుత్వ యంత్రాంగమా లేక రేవంత్ రెడ్డి ప్రైవేట్ సైన్యమా?" అని నిలదీశారు. ఆయన ఆరోపిస్తూ, "హిమాయత్‌సాగర్ పరిధిలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఇల్లు ఉంది, బఫర్ జోన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఉంది. కానీ వీరిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పేదల ఇళ్లపై మాత్రమే బుల్డోజర్లు నడుస్తున్నాయి," అన్నారు. ఇది కాంగ్రెస్ పాలనలో ఉన్న ద్వంద్వ న్యాయం, రాజకీయ వివక్షకు స్పష్టమైన ఉదాహరణ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు – "పేదల ఇళ్లు కూల్చడం ధర్మమైతే, పెద్దల భవనాలను వదిలేయడం ఏ న్యాయం? మీరే చెప్పిన చట్టాలు అందరికీ వర్తించవా?" అని ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిజంగానే పారదర్శకతతో ఉంటే, ఇలాంటి చర్యలు సమానంగా ఉండాలని అన్నారు. తన ప్రసంగం ముగింపు భాగంలో కేటీఆర్ ప్రజలకు పిలుపునిస్తూ, "హైడ్రా బుల్డోజర్ పేదల కన్నీటి మీద నడుస్తోంది. కాంగ్రెస్ పాలనలో న్యాయం అనే పదం మాయమవుతోంది. ప్రజలు ఈ అన్యాయాన్ని గమనించి, తమ ఓటుతో సరైన సమాధానం ఇవ్వాలి," అని అన్నారు. ఈ వ్యాఖ్యలతో హైడ్రా వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడి పుట్టించింది. పేదల ఇళ్ల కూల్చివేతలు, పెద్దల ఇళ్లకు మినహాయింపు ఇవ్వడం వంటి ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తీవ్ర విమర్శల వలయంలో పడింది. కేటీఆర్ ఆగ్రహ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి.

## చరిత్ర సృష్టించిన భారత వనితలు

జెమీమా రోడ్రిగ్స్ (24), హర్మన్‌ప్రీత్ కౌర్ (20) త్వరగా నిష్క్రమించినా.. ఆల్ రౌండర్ దీప్తి శర్మ (58 నాటౌట్), రిచా ఘోష్ (34) నిలకడగా ఆడి.. జట్టు స్కోరు 298కి చేర్చారు. 299 పరుగుల లక్ష్యంతో ఛేదన మొదలుపెట్టిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు లారా వోల్వార్డ్ట్ (65), తాజ్మిన్ బ్రిట్స్ (23) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే కీలక సమయంలో అమన్‌జోత్ కౌర్ మెరుపు ఫీల్డింగ్‌తో బ్రిట్స్ రనౌట్ అవ్వడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వేసిన మాస్టర్ స్ట్రోక్ అద్భుత ఫలితాన్నిచ్చింది. బ్యాటింగ్‌లో అదరగొట్టిన షెఫాలీ వర్మను అనూహ్యంగా బౌలింగ్‌కు తీసుకురాగా, ఆమె బ్రేక్‌త్రూలు అందించింది. తన అద్భుతమైన స్పిన్ మాయాజాలంతో షెఫాలీ.. దక్షిణాఫ్రికా కీలక బ్యాటర్లైన సునె లూస్ (25), మరిజానే కాప్ (4) వికెట్లు తీసి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో, ఒత్తిడిలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు చేతులెత్తేశారు. భారత మహిళలు చారిత్రక విజయాన్ని సాధించడంతో దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది.

## బీహార్‌ను.. హబ్‌గా మార్చడమే లక్ష్యం

నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పటికే 13 మిలియన్ల మంది మహిళల ఖాతాలకు ఒక్కొక్కరికి 10,000 రూపాయలు బదిలీ చేశామని, ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ సహాయం పెంచుతామని ప్రధాని మోదీ అన్నారు. ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని, "ఒక వైపు ఎన్డీఏ నిజాయితీగల మ్యానిఫెస్టో ఉంది, మరోవైపు, మహా కూటమి అబద్ధాల కట్ట ఉంది. బీహార్ ప్రజలు తేల్చుకోండి" అని అన్నారు. బీహార్‌ను అడవి రాజ్యం నుండి కాపాడి, మరోసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "అభివృద్ధి చెందిన బీహార్ అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాది, దీనికి మీ మద్దతు కోరుతూ నేను వచ్చాను" అని ఆయన అన్నారు. "దేశంలో అత్యధిక యువ జనాభా ఉన్న రాష్ట్రాలలో బీహార్ ఒకటి, అందుకే బీహార్‌లో విద్య, నైపుణ్యాలకు ఎన్డీఏ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. బీహార్ యువత బీహార్‌లోనే పని చేసి బీహార్‌కు ఖ్యాతిని తీసుకురావాలనేది మా సంకల్పం. దీని కోసం, రాబోయే సంవత్సరాల్లో కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించాము. ఇది కేవలం ప్రకటన మాత్రమే కాదు, ఇది ఎలా జరుగుతుందనే ప్రణాళికను కూడా ప్రజల ముందు ఉంచాము" అని ప్రధాని మోదీ అన్నారు. "నేడు ప్రపంచంలో మేక్ ఇన్ ఇండియా గురించి చాలా ఉత్సాహం ఉంది. బీహార్‌ను మేడ్ ఇన్ ఇండియా కేంద్రంగా మార్చడమే మా లక్ష్యం. దీని కోసం, వేలాది చిన్న, కుటీర పరిశ్రమల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తాము" అని ఆయన అన్నారు. ఆర్జేడీని విమర్శిస్తూ, ప్రధాని మోదీ.. "ఆర్జేడీ జంగిల్ రాజ్ లక్షణాలు హింస, క్రూరత్వం, ద్వేషం, చెడు ప్రవర్తన, చెడు పాలన, అవినీతి బీహార్ ప్రజలు చూశారు. ఆర్జేడీకాంగ్రెస్ మధ్య వైరం ఉంది. ఎన్నికల తర్వాత వారు వీడిపోక తప్పదు. ఆర్జేడీ నాయకుడు ముఖ్యమంత్రి పదవిలో ఉండాలని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదు" అని ప్రధాని మోదీ అన్నారు. "ఆర్టికల్ 370 రద్దుకు హామీ ఇచ్చామని, ఆ హామీని ఆయన నెరవేర్చారని ప్రధానమంత్రి అన్నారు. నేడు, భారత రాజ్యాంగం జమ్మూ కాశ్మీర్‌లో వర్తిస్తుంది" అని అన్నారు. "వన్ ర్యాంక్ వన్ పెన్షన్" అనే వాగ్దానాన్ని నెరవేర్చాలని కూడా ఆయన పునరుద్ఘాటించారు. "ఇప్పటివరకు, బీహార్‌లో 6 మిలియన్ల పేద కుటుంబాలకు శాశ్వత గృహాలు అందించాము. రైతులు ఇప్పుడు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏటా 9,000 రూపాయలు అందుకుంటారు. రాబోయే సంవత్సరంలో ఒక కోటి ఉద్యోగాలు సృష్టించడం జరుగుతుంది. దీని కోసం ఒక ప్రణాళికను ప్రజలకు సమర్పించాము" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "13 మిలియన్ల మహిళల బ్యాంకు ఖాతాలకు 10,000 రూపాయలు నేరుగా బదిలీ చేశాము" అని అన్నారు. తాము వాగ్దానం చేసిన వాటిని నెరవేర్చడంలో ఎన్డీఏకు ట్రాక్ రికార్డ్ ఉందని ప్రధాని మోదీ అన్నారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు

తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామి వారి వ్రత పూజలు నిర్వహించుకోవడం ఆనవాయితీ కావడంతో భక్తులు భారీగా వ్రత పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. యాదగిరి కొండపైన ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..** శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.66,76,776 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,47,600, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,85,700, వీఐపీ దర్శనం ద్వారా రూ.12,75,000, సత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.13,32,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,03,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,22,948, ప్రసాద విక్రయం ద్వారా రూ.17,42,070, కల్యాణకట్ట ద్వారా రూ.1,19,450తో పాటు వివిధ శాఖ,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు..** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. హైదరాబాద్ కు చెందిన కూచిపూడి కళాక్షేత్రం కూచిపూడి నృత్యప్రదర్శనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

**ఈనెల 5న అన్నకూటోత్సవం..** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని అన్నకూటోత్సవం నిర్వహించనున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఇంచార్జి ఈవో హరీష్ తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణం అనంతరం నిర్వహించనున్నట్లు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల మధ్య గోష్టి, గర్భాలయ శుద్ధి జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6.30కి ఆస్థాన మండపంలో ఆకాశ దీపారాధన చేయనున్నట్లు తెలిపారు.

# అవమానించిన చోటే గెలుపు పిలుపును వినిపించింది

**నువ్వింతే అన్నోల్లే.. ఇవ్వాలా నీ వల్లే అని పొగుడుతుంది...**
**ఓటమి ఎరుగని ఆస్ట్రేలియన్ సెమీఫైనల్ లో దిమ్మ తిరిగే షాక్ ఇచ్చి భారతదేశ కీర్తిని చాటింది జమీమా 339 పరుగులు చేసిన మహిళా క్రికెటర్... ఒంటి చేత్తో భారత్ ను ప్రపంచ ఫైనల్ కు చేర్చిన ఘనత సాధించింది అమీమా.. దేశం గర్వించేలా వంటి చేత్తో విజయానికి చేరువ తెచ్చినా... దేశ మీడియా ఎందుకు నోరు మెదపలేక పోతోంది.?**
**రాజకీయంలో కుల పెత్తనమే.. మీడియాలో కుల పెత్తనమే... కుల గజ్జితో రగిలిపోతున్న ఈ వ్యవస్థను బాగు చేయడానికి ప్రతిభను కనబరుస్తున్న యువతకు దేశం సలాం కొట్టాల్సిందే.. మరి నేడు మీడియా అసలు స్వరూపాన్ని బయట పెట్టేందుకు యువత తమ ప్రతిభను మెరుగ్గా కనపరచాలి...**







✍ జయభేరి, హైదరాబాద్ :

ప్రపంచాన్ని తన వైపు తిప్పుకున్న కులం పేరుతో వెనకకు నెట్టేసిన ఈ సమాజాన్ని అగ్గితో కాల్చాలా..!? ఒంటి చేత్తో భారత్ ను ప్రపంచ కప్ ఫైనల్ కు చేర్చిన కులం పేరుతో గొంతెత్తి చాటని మీడియాను దుమ్మెత్తి పోయాలా.!? 77 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఇంకా కులం మతం అని కొట్టుకు చచ్చే ఈ సమాజాన్ని కాల్చి బూడిద చేయాలా!? అన్ని మీడియా పత్రికలు మీడియా ఛానల్లు దేశమాత నుదుటిన తిలకం దిద్దిన సరే తక్కువ కులం అనే నెపంతో ఆ తల్లిని అవమానిస్తే చూస్తూ ఊరుకుందామా..!? ఈ దేశం ఇంకా కులమత విద్వేషాలతో రగిలిపోతుంది.. ఈ యువత రాజకీయ పార్టీల జెండాలను మోస్తోంది...శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ వస్తున్న కుల మత చాందసవాదంతో అట్టడుగులోకి వెళుతున్న ఈ దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకారంగా మిగిలిపోతుంది... నా దేశమా ఈ కులాన్ని ఎప్పుడు నాశనం చేస్తావు..!? నా సమాజమా ఇంకా మేలుకోకపోతే నీ మనుగడ నీ అభివృద్ధి ఇంకా నెట్టబడి వెనక్కి పోతుంది... రాజ్యాధికారం కోసం ముందడుగు వేస్తే ఇలాంటి ఎన్నో విజయాలను ఆ దేశమాత మెడలో హారాలుగా వేయొచ్చు... ఇంకెందుకు అనుమానం? ఇంకెన్నాళ్లు మీ సహనం?

రాజ్యాధికారం కోసం అగ్గి రవ్వలై సమాజంలోని కుల మతం కుళ్ళును బుగ్గి చేద్దాం..

జమీమా ఈ పేరు ఇప్పుడు దేశం మొత్తం మారుమోగుతున్న క్రికెటర్ పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నిజానికి జె మీమా ఆడపిల్లగా సోషల్ మీడియాలో మంచి సింగర్ గా గిటార్ వాయిస్తూ ఎన్నో పాటలు పాడుతూ ఆనందంగా జీవితాన్ని గడుపుతున్న కాలంలోనే ఆమెను నెటిజన్లు అవహేళన చేస్తూ వికృత కామెంట్లు పెడుతున్నప్పటికీ జెమీమా ఏమాత్రం చెక్కుచెదరలేదు. క్రికెట్ ఆమెకు ఒక పెద్ద ఫ్యాషన్... ఈ పని చేసిన క్రికెట్ మీద ఉన్న అభిమానం ఆమెను ఇవ్వాలా దేశస్థాయి కాదు ప్రపంచాన్ని తన వైపు తిప్పుకునేలా చేసింది.. ఏకంగా బౌలింగ్ బ్యాటింగ్ లో కూడా అన్ని రంగాల్లో క్రికెట్లో అగ్రగామిగా నిలిచి భారతదేశాన్ని పతాక స్థాయికి చేర్చింది. ఆస్ట్రేలియా లాంటి క్రికెటర్ దిగజాన్ని ఓడించిన ఘనత కూడా ఆమె అకౌంట్లో పొందుపరచుకుంది. కానీ ఈ దేశం ఆమెకి ఇచ్చిన బహుమానం మాత్రం తక్కువనే చెప్పాలి.. ఎందుకంటే ఇక్కడ ఈ క్రికెటర్ కులం తక్కువ అన్న అనుమానము ఏమో తెలియదు కానీ మొత్తం మీద పెద్ద పత్రికలు అని చెప్పబడ్డ ఏ పత్రికలు ఆమె గురించి అంతగా ప్రచురించలేకపోయాయి చెప్పలేకపోయాయి. అలా అని అన్ని పత్రికలు కాదు



✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

కొన్ని పత్రికలు బాగానే జెమీ జీవితాన్ని ఆవిష్కృతం చేశాయి. నీటి అమ్మాయిలు ఎన్ని అవమానాలు పాలైన ఎంత అవహేళన చేసినా ఈ సమాజం వెలివేసిన నిబ్బరంగా నిజాయితీగా తమ ప్రతిభను చూపించాలన్న దృఢ సంకల్పాన్ని ఈ క్రికెటర్ తన జీవితం ద్వారా నిరూపించింది.. చిన్న సమస్య వస్తేనో ఏదైనా ఆపద వస్తేనో ఎవరన్నా కామెంట్ చేస్తేనో దిగాలుగా ఉండి బాధపడి మనసులో వేదన చెంది ఆత్మ నునేతకు గురై మరణించాలనుకునే వారు

కూడా జెమీ క్రికెటర్ జీవితాన్ని చదివితే చాలు.. బ్రతకాలి ఏదో సాధించాలి అనే ఒక సంకల్పం మాత్రం రావడం ఖాయం. ఎందుకంటే ఆడపిల్ల పుట్టిందంటేనే ఆ కుటుంబం దిగాలుతో దుఃఖంతో, ఎడమొఖం పెడ ముఖం పెట్టే కుటుంబాలు కూడా లేకపోలేదు... కానీ ఆడపిల్లలే అని చూడకుండా మంచిగా చదివించి ఆటల్లో నైపుణ్యం ని చూపించే విధంగా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ఆ దిశగా జీవితాన్ని మలిస్తే ఖచ్చితంగా దేశానికే కాదు కుటుంబాన్ని కూడా అగ్రస్థానంలో నిలబెట్టడం తథ్యం అని క్రికెటర్ జమీ జీవితం ద్వారా ఇవాళ దేశం తన వైపు చూసేలా చేసింది... కాదేది కవిత గనకం అగ్గిపుల్ల సబ్బుబిళ్ళ ఆడపిల్ల కుక్కపిల్ల అని అన్న శ్రీ శ్రీ మహాశయుని సాక్షిగా ఇవ్వాలా నేషనల్ క్రికెట్ స్థాయిలో మంచి పేరును సాధించుకోవడం భారతదేశంలో ఆమెను సఘోరంగా గౌరవించడం చూస్తే ప్రతి ఇంట్లో ఆడపిల్ల ఈ విధంగా ఎదగాలని కోరుకోవడంలో తప్పులేదు... కచ్చితంగా ఆడపిల్ల ఉన్న ప్రతి ఇంట్లో అమ్మాయికి ఎలాంటి విషయాలపై ఆసక్తి ఉందో తల్లిదండ్రులు గ్రహించి ఆలోచనల తగ్గట్టుగా ఆ ప్రతిభను వెలికి తీసే పనిలో ఉండాలి.. చదువుతోపాటు మరి ముఖ్యంగా ప్రతిభ అనేది చాలా ముఖ్యం కాబట్టి ఆ దిశగా మన దేశంలోనే తల్లిదండ్రులందరూ ఆలోచిస్తారని ఆశిస్తున్నా..

# భార్యాభర్తల అనుబంధం పవిత్రమైనది

జయభేరి ఆధ్యాత్మిక శీర్షిక





✍ Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

నీకెంత అదృష్టం కలసి వచ్చినా, నువ్వెంత కష్టం చేసే వాడివే అయినా, నీ భార్య సహకారం లేకుండా నువ్వు ఏ రంగంలోనూ రాణించ లేవు. తన భర్త ఆదాయం, ఖర్చులను గమనిస్తూ... తనకు సంబంధించిన ఖర్చులను తగ్గించుకునే భార్య నిజంగా ఓ వరమే..! అర్థం చేసుకునే భార్య దొరికితే.. అడుక్కుతినే వాడు కూడా హాయిగా జీవిస్తాడు. అహంకారి భార్య దొరికితే అంబానీ అయినా సన్యాసుల్లో కలవాల్సిందే. ప్రతి భర్త తన భార్యను... మరో తల్లి రూపంగా భావిస్తే... ప్రతిభార్య తనభర్తను, మొదటి బిడ్డగా పరిగణిస్తుంది... ఇదే మధురమైన బంధం... ఇప్పటికీ... ఎప్పటికీ. భార్యకు సేవ చేయడం అంటే బానిసగా బ్రతుకుతున్నామని కాదు. దాని అర్థం బంధాన్ని గౌరవిస్తున్నామని. సంసారం అంటే కలసి ఉండడమే కాదు. కష్టాలే వచ్చినా కన్నీరే ఏరులై పారినా.. ఒకరిని ఒకరు అర్థం చేసుకొని కడవరకూ ఒకరినొకరు వీడకుండా, తోడూనీడగా ఉండడం. ఒక మంచి భర్త భార్య కన్నీరు తుడుస్తాడు ఏమో! కానీ, అర్థం చేసుకునే భర్త ఆ కన్నీటికి కారణాలు తెలుసుకుని... మళ్లీ తన భార్య కళ్లలో కన్నీరు రాకుండా చూసుకుంటాడు.

భార్యాభర్తల సంబంధం శాశ్వతం. కొంతమంది మధ్యలో వస్తారు. మధ్యలోనే పోతారు. భార్యకి భర్త శాశ్వతం. భర్తకు భార్య శాశ్వతం. ఇంటి వ్యవహారాలు చక్కగా నిర్వహించగలిగే ప్రతి గృహిణీ, గొప్ప విద్యావంతురాలి కిందే లెక్క. అమ్మ లేకుంటే మనకు జన్మ లేదు. భార్య లేకుంటే ఆ జన్మకు అర్థం లేదు. మోజు తీరగానే మూలన పడేసేది కాదు మూడుముళ్ల బంధం. ముసలి తనంలో కూడా మనసెరిగి ఉండేది 'మాంగల్య బంధం.' బంధాలు శాశ్వతంగా తెగిపోకుండా ఉండాలి అంటే, ఎదుటివారు తప్పు చేస్తే క్షమించాలి. మనం తప్పు చేస్తే క్షమించమని అడగాలి. మూర్ఖురాలైన మహిళ తన భర్తను బానిసను చేసి ఆ బానిసకు యజమానిగా ఉంటుంది. కానీ, తెలివైన మహిళ తన భర్తను రాజును చేసి ఆ రాజుకు తను రాణిగా ఉంటుంది. కుటుంబంలో ఎన్ని కీచులాటలున్నా... సమాజంలో భర్త పరువు నిలబెట్టాల్సిన బాధ్యత భార్యది. భార్యను చులకనగా చూడకుండా గౌరవించ వలసిన ధర్మం భర్తది. నీ సంతోషం నేను కాకపోయినా, నా చిరునవ్వు మాత్రం నువ్వే. నీ ఆలోచన నేను కాకపోయినా, నా ప్రతి జ్ఞాపకం నువ్వే. ప్రేమ అనేది చాలా విలువైనది. దాన్ని 'వివాహం' అనే అద్దాల బీరువాలో పెట్టుకుంటేనే అది రాణిస్తుంది. సృష్టి తీర్చిదిద్దిన అతి గొప్ప కళాఖండం కుటుంబం. గొడవ పడకుండా ఉండే బంధం కన్నా... ఎంత గొడవ పడినా విడిపోకుండా ఉండే బంధం దొరకడం ఒక గొప్ప వరం. పెళ్లి అనేది అందమైన పూలవనం లాంటిది. ఆ వనంలో మనం నాటే చెట్లు అందమైన పువ్వుల నిస్తాయి. ముత్యాల తలంబ్రాలు, నేలకు జారిన తారకలై, ఇద్దరి తలలనే కాదు, తలపులనూ ముద్దుగ తడుపును మెరిసే జలధారలై! సప్తపది ఏడు అడుగులు.. అంటే, ఏడు జన్మల బంధం ప్రతి అడుగు ఒక వాగ్దానం. ఏడడుగులు వేయడం అనేది కేవలం ఒక సంప్రదాయం కాదు, ప్రతి అడుగుతో జీవిత భాగస్వాములుగా ఒకరికొకరు భరోసాని ఇచ్చుకుంటారు.

ఒక్కో అడుగు వెనుక ఒక్కో అర్థం ఉంది:

మొదటి అడుగు ఆహారం సమృద్ధి కోసం, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ వేసేది.. అన్న వృద్ధికి బలవృద్ధికి వేసేది రెండవ అడుగు ధన వృద్ధికి మూడవ అడుగు సుఖవృద్ధికి నాల్గవ అడుగు. ప్రజాపాలనకి ఐదవ అడుగు. దాంపత్య జీవితానికి ఆరవ అడుగు. సంతాన సమృద్ధికి ఏడవ అడుగు.

కోరుకున్న ఇంతి... నేడు నీ సతి... నేడు నీవు పట్టుకున్న ఆమె చేయిని... విడవకు ఎన్నటికీ. వివాహాన్ని సుఖమయం చేసుకోవడానికి మీరెంత పొందికగా ఉన్నారనేది కాదు. పొందిక లేని విషయాలను మీరెలా సర్దుకుంటున్నారు అనేది ముఖ్యం. కలిమి లేములతో... కలసిన మనసులతో... కలివిడిగా మసలుకోవాలి.. కలకాలం సుఖసంతోషాలు పంచుకోవాలి. వివాహ వార్షికోత్సవం అంటేప్రేమ, విశ్వాసం, భాగస్వామ్యం, సహనం, ఓర్పుల సంగమాన్ని పండుగ చేసుకోవడమే..! బంధం అన్నది అందమైన పుస్తకం లాంటిది. పొరపాటు అనేది అందులో ఒకపేజీ మాత్రమే..! ఆ ఒక్క పొరపాటు జరిగితే సవరించాలి. కానీ, మొత్తం పుస్తకాన్ని చించివేయ కూడదు. మగవాడు గాలి పటం. (అందని ఎత్తులకు ఎదగడం తెలుసు. కానీ, తనను తాను నియంత్రించు కోవడం తెలీదు) ఆడది దారం, అతడికి తనే ఆధారం. (ఆమెకు వెన్నంటి ప్రోత్సహించడం తెలుసు, కానీ ప్రతిభను పదిమందికి ప్రదర్శించడం తెలీదు) విడివిడిగా దేనికీ విలువ లేదు. ఇద్దరూ ఒక్కటైతే వారికి తిరుగులేదు. భర్తకి భార్య బలం కావాలి. బలహీనత కాకూడదు. భార్యకి భర్త భరోసా కావాలి. భారం కాకూడదు. భార్యా భర్తల బంధం అన్యోన్యం కావాలి. అయోమయం కాకూడదు. మనసులోని ప్రేమని, బాధని కళ్లలో చూసి చెప్పకుండానే గుర్తించగలిగిన వ్యక్తి భాగస్వామిగా దొరికితే, అంతకు మించిన అదృష్టం మరొకటి ఉండదు. అందాన్ని చూసి పెళ్లి చేసుకోవడం అంటే... ఇంటికి వేసిన రంగులు చూసి ఇల్లు కొనుక్కోవడమే. పెళ్లి అంటే ఈడూజోడూ, తోడూనీడా, కష్టం సుఖం గురించి కాదు. ఇద్దరూ ఐక్యమైపోయి తమని ఉద్ధరించుకొనే ఒక మంచి అవకాశం. ప్రతీ అమ్మాయికి చదువుకున్న భర్త రావడం సహజం. కానీ తన మనసు చదివిన భర్త రావడం అదృష్టం అనుకుంటుంది భార్య. భర్త భార్య ఇద్దరు ఒకరికి ఒక్కరు దేముడుగా మారాలి...

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు దాడి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన దాడిని ఖండించిన మండల కన్వీనర్ దొడ్డినవంబర్ 2 జయభేరి తాతారావు

**జయభేరి, చర్ల, నవంబర్ 2 :**



మణుగూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని చర్ల బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతరావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు జిల్లాకు జరుగుతున్న నష్టాన్ని ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన పోరాడుతుంటే తట్టుకోలేక కాంగ్రెస్ గుండాలు పార్టీ కార్యాలయంపై దాడి చేశారని. ప్రశాంతంగా ఉన్న జిల్లాను బ్రష్టు పట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తుందని, రాష్ట్రంలో అరాచక పరిపాలన నడుస్తుందని, గత 10 సంవత్సరాల్లో ఎప్పుడు ఇలాంటి నీచ పరిస్థితులు చూడలేదని, కానీ కాంగ్రెస్ గద్దెనెక్కిన 2వ సంవత్సరంలోనే రాష్ట్రం మొత్తం రౌడీ రాజ్యం నడుపుతుందన్నారు. సామాన్య ప్రజలు సైతం భయపడే పరిస్థితి నెలకొందని, దాడి జరిగే సమయంలో బీఆర్ఎస్ నాయకుల పై దౌర్జన్యం చేసారని, ఈ విధంగా కార్యకర్తలను రెచ్చగొట్టే ఎమ్మెల్యేలు వచ్చే ఎన్నికల్లో కంటికి కూడా కనపడరని, ఈ దాడికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేకపోతే వెంటనే దాడికి పాల్పడిన వారినీ అరెస్ట్ చేసి కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేసారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కోకన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, కోరం కన్నారావు, ఎడ్ల రాందాస్, కట్టం కన్నారావు, తుర్రం రా,జు కొంగూరి సోమరాజు, మునిగల సాంబ, గాదం శెట్టి కిషోర్, కుక్కడపు సాయి, సృజన తదితరులు పాల్గొన్నారు.



## కారు గుర్తుకు ఓటు వేస్తేనే అభివృద్ధి

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 02:**

మాగంటి సునీతమ్మ కారు గుర్తుకు ఓటు వేస్తే అభివృద్ధి పరుగులు తీస్తుందని బిఆర్ఎస్ నేతలు ఆదివారం జూబ్లీహిల్స్ లో ఎన్నికల ప్రచారం సాగించారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి తదితరులు బోరబండ డివిజన్ లోని గాంధీ నగర్ లో ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయమని ప్రచారం చేశారు. గాంధీనగర్ లో పార్టీ కార్యకర్తలు ఇటీవల అనారోగ్యంతో ఉండడంతో... వారి కుటుంబాలను పరామర్శించారు. ప్రతి గడపగడపకు వెళ్లి ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి బిఆర్ఎస్ పార్టీ విజయానికి మద్దతు కోరారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలని ఆయన ప్రజలను విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణ అభివృద్ధి చక్రం తిరగడానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో మాగంటి సునితమ్మ గెలిపించాలని కోరారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇస్రో ఖాతాలో మరో ఘనత

CMS03 ఉపగ్రహం ముఖ్యంగా భారత నావికాదళం కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఇది 2013 లో ప్రయోగించిన GSAT7 (రుక్మిణి) స్థానం లో పనిచేయనుంది. ఈ శాటిలైట్ UHF, S, C, Q బ్యాండ్‌ల ద్వారా పనిచేస్తూ, భారత భూభాగం సముద్ర ప్రాంతాలలో అత్యంత విశ్వసనీయ కమ్యూనికేషన్ సేవలు అందిస్తుంది. ఇది నావికాదళ కార్యకలాపాలు, సిట్యుయేషనల్ అవేర్‌నెస్, సుదూర సముద్ర జలాలలో కార్యకలాపాలు నిర్వహించాలనే భారత్ బ్లూవాటర్ ఆశయాలను పెంపొందిస్తుంది.

రియల్‌టైమ్ కమ్యూనికేషన్ సేవలు

ఈ అధునాతన ఉపగ్రహం యుద్ధనౌకలు, సబ్‌మెరైన్‌లు, విమానాలు కోస్ట్ కమాండ్ సెంటర్ల మధ్య రియల్‌టైమ్ వాయిస్, వీడియో, డేటా ట్రాన్స్‌మిషన్‌కు వీలు కల్పిస్తుంది. ఇందులో హై-త్రూపుట్ ట్రాన్స్‌పాండర్లు అప్‌గ్రేడెడ్ ఎన్‌క్రిప్షన్ (గుప్తీకరణ) ఫీచర్లు ఉన్నాయి. ఈ విధంగా, సముద్ర తీరప్రాంత పర్యవేక్షణ (మెరిటైమ్ డొమైన్ అవేర్‌నెస్) గ్రిడ్ లో CMS03 ఒక కీలకమైన ముడి పాత్ర పోషిస్తుంది. ఈ ప్రయోగం నావికాదళ అధికారుల సమక్షం లో విజయవంతం కావటం విశేషం.

'బహుబలి' అని ముద్దుగా పిలుచుకునే LVM3M5 రాకెట్, LVM3 శ్రేణి లో ఐదో ఆపరేషనల్ ఫ్లైట్. ఈ మూడుదశల హెవీ లిఫ్ట్ వెహికల్ మొదటి దశ లో S200 సాలిడ్ రాకెట్ బూస్టర్‌లు, రెండో దశ లో L110 లిక్విడ్ ప్రొపెల్లెంట్, మూడో దశ లో C25 క్రయోజెనిక్ ఇంజన్‌ను కలిగి ఉంటుంది. ఇది 4,000 కిలోగ్రాముల వరకు ఉపగ్రహాలను జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (GTO) లోకి, 8,00010,000 కిలోగ్రాముల వరకు లో ఎర్త్ ఆర్బిట్ (LEO) లోకి మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంది. ఈ మిషన్ లో శాటిలైట్‌ను సబ్GTO లో అమర్చగా, రాబోయే 47 రోజులలో అందులోని లిక్విడ్ అపోజీ మోటార్ (LAM) ద్వారా అది జియోస్టేషనరీ ఆర్బిట్ (భూస్థిర కక్ష్య) చేరుకోనుంది.

## ఈ కేసులో నెక్స్ట్ టార్గెట్ ఎవరు?

నకిలీ మద్యం తయారీ జరిగితే తమ పార్టీ నేతలను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. సమస్యలు, వైఫల్యాలను తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు చేశారంటూ జగన్ పేర్కొన్నారు. సీబీఐ విచారణ జరపాలని పిటిషన్ వేసిన మరుసటిరోజే.. జోగి రమేష్‌ను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. భయంతో చంద్రబాబు తప్పుల మీద తప్పులు చేస్తున్నారని ఆరోపించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే జోగి రమేశ్ అరెస్ట్ జరిగిందన్నారు మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్. నకిలీ మద్యం కేసుపై సీబీఐ విచారణ ఎందుకు జరపడంలేదని ప్రశ్నించారు.

**జోగి రమేష్ భార్య శకుంతల దేవి ఏమన్నారంటే..**

తన భర్త తప్పు చేసినట్టుగా.. కూటమి నేతలు ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు జోగి రమేష్ భార్య శకుంతల దేవి. తన భర్తపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**అది నకిలీ మద్యం కాదు.. స్లో పాయిజన్**

వైసీపీ నేతల విమర్శలకు అధికార కూటమి కౌంటర్ ఇస్తోంది. జోగి రమేష్ అండ్ టీమ్ తయారుచేసింది నకిలీ మద్యం కాదు.. స్లో పాయిజన్ అంటూ సంచలన ఆరోపణలు చేశారు టీడీపీ నేత బుద్ధా వెంకన్న. దుర్గమ్మ సన్నిధిలో జోగి రమేశ్ అసత్య ప్రమాణం చేశారు కాబట్టే.. అమ్మ ఆగ్రహించిందన్నారు. జోగి అరెస్ట్‌తో తన పేరు బయటకు వస్తుందని జగన్ భయపడుతున్నారంటూ కామెంట్ చేశారు బుద్ధా వెంకన్న. ఇదే కేసులో జోగి రమేష్ ప్రధాన అనుచరుడు ఆరేపల్లి రామును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే.. ఆయన స్టేట్‌మెంట్ రికార్డ్ చేసి విడిచిపెట్టారు. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది వైసీపీ.. ఇదిలాఉంటే.. జోగి రమేష్ అరెస్ట్ తర్వాత పాలిటిక్స్ హీటెక్కడంతోపాటు.. నెక్స్ట్ టార్గెట్ ఎవరనేది.. చర్చనీయాంశంగా మారింది..

## నేడు వాహనాల వేలం పాట



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్స్ఛేంజ్ స్టేషన్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలంపాట నేడు ఎక్స్ఛేంజ్ స్టేషన్ వద్ద వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్స్ఛేంజ్ సీఐ శ్రీనివాస్ తెలియజేసినారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాలకు పదివేల రూపాయలు ఫోర్ వీల్ వెహికల్స్ కు 30 వేల రూపాయలు డిపాజిట్ చేసి నమోదు చేయించుకోవాలని తెలియజేసినారు వేలం పాటలో వాహనాలు దక్కించుకొని వారికి డిపాజిట్ వాపసు అందజేస్తామని తెలియజేశారు.

# మహిళలను గౌరవిద్దాం

- మహిళలకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలి
- బహుజన సమాజ్ పార్టీలో చేరిన పసల రమణ

**జయభేరి, చర్ల, నవంబర్ 2 :**



చర్ల మండల కేంద్రంలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించుకోవడం జరిగింది. సమావేశం అనంతరం అందరికి సుపరిసితురాలు సమాజం పట్లా అవగాహనా కలిగిన మహిళా పసల రమణ గారు బహుజన్ సమాజ్ పార్టీలోకి చేరడం జరిగింది.ఈ సందర్బంగా పార్టీ మండల అధ్యక్షులు కొండా కౌశిక్ పసల రమణ గారికి పార్టీ కండువా కప్పి గౌరవంగా పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ పట్ల, పార్టీ సిద్ధాంతం పట్ల, పార్టీ చేస్తున్న కార్యక్రమాల పట్ల, ఆకర్షితులై పసల రమణ గారు పార్టీలోకి స్వచ్ఛందంగా చేరడం జరిగిందని తెలిపారు.ఆమె చేరికనూ శుభపరిణామంగా bsp పార్టీ భావిస్తున్నాదని అన్నారు.మహిళలను గౌరవించడం పట్లా బహుజన్ సమాజ్ పార్టీ ఎప్పుడు ముందు అడుగులో ఉంటుందని తెలిపారు.రమణ గారి కుటుంబానికి పార్టీ నాయకత్వం నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు.

మహిళల చట్టాలు భారత రాజ్యాంగంలో పకడ్బందిగా వున్నప్పటికి వారి పై జరుగుతున్న అత్యాచారాలు ఆగడం లేదని అయన మండిపడ్డారు.మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలంటే మహిళలు మొత్తం కూడా బెహన్ జీ మాయావతి గారినీ నిదర్శంగా తీసుకోనీ ఆమె అడుగుజాడల్లో నడవాలని అయన కోరారు.తద్వారానే మహిళల చట్టాలను కాపాడుకోగలమణి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, కోశాధికారి బాషా, కార్యదర్శి కుమారి, ఈసీ మెంబెర్ విజయ్, సోషల్ మీడియా ఇంచార్జి పవన్, సుశీల,లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం

**జయభేరి, దేవరకొండ :**



తెలంగాణ రాష్ట్ర గిరిజన మహిళ డిగ్రీ కళాశాల దేవరకొండ మండలం మర్రిచెట్టు తండా దుబ్బ తండా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఎన్ ఎస్ ఎస్ యూనిట్ 1 యూనిట్ 2ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించబడినది. ఈ శిబిరం ద్వారా విద్యార్థినిలు గ్రామీణ ప్రాంతాల సేవా కార్యక్రమాలు చేస్తారు. పర్యావరణ పరిశుభ్రత, చెట్లు నాటడం, ఆరోగ్య అవగాహన, మహిళా సాధికారత, బాల్యవివాహాలు, ఓటింగ్ ఉపయోగించుకోవడం, వంటి సేవా కార్యక్రమాలు ఈ శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశాలు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి మాట్లాడుతూ విద్యార్థినులలో సామాజిక బాధ్యత భావం నాయకత్వ లక్షణాలు మరియు సేవా మనోభావం పెంపొందుతాయి. అందువల్ల అన్ని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ ప్రత్యేక శిబిరంలో పాల్గొని సమాజానికి సేవ చేయగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమం ఏడు రోజుల నిర్వహించబడినది యూనిట్ 1 మరి చెట్టు తండా మాజీ సర్పంచ్ నేనావత్ శీను నాయక్, యూనిట్ 2 దుబ్బ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ చంద్రి లక్ష్మణ్ నాయక్ ఎన్ఎస్ఎస్ విద్యార్థినిలకు ప్రోత్సాహం అందించారు. ఏడవ రోజు ఈ కార్యక్రమానికి విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలియజేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి, పంచాయతీ సెక్రెటరీ కీర్తి, దుబ్బ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ చంద్రి లక్ష్మణ్ నాయక్, మర్రి చెట్టు తండా మాజీ సర్పంచ్ నేనావత్ శీను నాయక్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ ఎన్ శ్వేత, యూనిట్ 1, యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్స్ ఏ. మినేశ్వరి, డాక్టర్ ఏ శ్యామల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం తక్షణమే 9 షెడ్యూల్లో చేర్చి 42% BC రిజర్వేషన్లపై శాశ్వత పరిష్కారం చూపాలి

- సామాజికవేత్త బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**జయభేరి, చింతపల్లి :**



చింతపల్లి మండలం వీటి నగర్ మాల్ గోల్కొండ విలేజ్ కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంఘం సభ్యులతో కలిసి శాంతియుతంగా భారీ ర్యాలీని బీసీలలో ఉన్నటువంటి అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు వీటికి మద్దతుగా ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కుల సంఘ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త , BC సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి ఆర్డినెన్స్ జీవో చట్టసభల్లో తీర్మానం జరిపి, గవర్నర్ కేంద్రంలో ఉన్నటువంటి రాష్ట్రపతికి బిల్లు పంపగా పెండింగ్ లో ఉంచి ఎన్నికలు జరపకుండా బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్లను కల్పించే విషయంలో శాశ్వతమైనటువంటి పరిష్కారాన్ని చేయాలని డిమాండ్ చేశారు. BRS రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్ సంగిభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల ఆర్మీ శ్రీను, చింతపల్లి మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షులుపూల యాదయ్య, జోరిగే రామకృష్ణ NLG మేదర సంఘం ప్రచార కార్యదర్శి, రెడ్డి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కాశగోని వెంకటయ్య, రెడ్డి యాదయ్య, జెసి లక్ష్మణ్ సాగర్, ముడిగ మల్లేశ్, అంగిరేకుల శ్రీకాంత్, అంగిరేకుల జగదీష్, దామెర శాంసన్, అంకం శీను, చిట్టిపోలు వెంకటేష్, సురికి జంగయ్య, గానాగోని అశోక్, గడ్డం ఆంజనేయులు, అజిమ్ పాషా, రావిరాల సీనయ్య, గుర్రం రాజు, కర్నాటి గణేష్, దువ్వ శ్రీనివాస్, మునగపాటి పురుషోత్తం, పున్న నరసింహ, అంకం చంద్రశేఖర్, రవి కూల్ డ్రింక్, ఆర్కపెల్లి సాయిప్రసాద్, కుకుడాల వినీత్, ఉడుతల వెంకటేష్, మదారం శివాజీ, లగోని శివకృష్ణ, అండెకా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసి రిజర్వేషన్లు మా హక్కు


- తెలంగాణ రాష్ట్రవిస్తృతస్థాయి సమావేశంలో నినదించిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 02:**

బీసి రిజర్వేషన్లు ఎవరిచ్చే బిక్ష కాదు ఇది మా హక్కు అని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కళింగ భవన్ లో బీసీ జేఏసీ తెలంగాణ రాష్ట్ర విస్తృ త స్థాయి సమావేశంలో బీర్ల అయిలయ్య పాల్గొని ప్రసంగించారు. బీసీ రిజర్వేషన్ ఉద్యమాన్నీ ఉధృతం చేసేందుకు,బిసిల విద్య ఉద్యోగ,రాజకీయ రిజర్వేషన్లు 42 శాతం సాధించడానికి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలొ పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ సాధనకు అన్ని పార్టీలు అన్ని వర్గాలు ఒక్కటై ఐక్యమత్యంగా ఉండి పోరాటం చేసి బీసీ 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. బీసీలకు న్యాయపరమైన రిజర్వేషన్లు లేకపోవడంతో అన్ని రంగాలలో వెనుక బాటుకు గురవుతున్నారని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు.

## విద్యుత్ షాక్ తో రెండు ఆవుల మృతి



**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 02:**

విద్యుత్ షాక్ తో రెండు ఆవులు మృతి చెందిన సంఘటన తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామంలో జరిగినది. గ్రామానికి చెందిన రైతు పిన్నపురెడ్డి సుధీర్ రెడ్డికు చెందిన రెండు పాడి ఆవులు ఉదయం తన వ్యవసాయ వద్ద మేతకు తీసుకెళ్లి మేస్తుండగా విద్యుత్ వైర్ తగిలి ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క ఆవు సుమారు 80 వేల రూపాయల విలువ ఉంటుందని రైతు ఆవేదనకు గురయ్యారు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతుకు తగిన నష్టపరిహారం ప్రభుత్వం, విద్యుత్ అధికారులు అందజేయాలని డిమాండ్ చేశారు.

## పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసిన చర్ల పోలీసు



**జయభేరి, చర్ల, నవంబర్ 2 :**


మణుగూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ గుండాలు బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు పై దాడి చేసి ఫర్నిచర్ కంప్యూటర్ లకు నిప్పుపెట్టడం, కార్యకర్తల పై భౌతిక దాడి చేయడం, మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. అదే సమయంలో మండల నాయకులు మణుగూరు వెళ్తున్నారనే సమాచారంతో ఎటువంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, డివిజన్ యువజన నాయకులు కాకి అనిల్, పంజా రాజు, యూత్ మండల అధ్యక్షుడు అంబోజి సతీష్, ఎడ్ల రామదాసు లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఇట్టి అరెస్టు ను మండల కన్వీనర్ దొడ్డి తాతారావు తీవ్రంగా ఖండించారు.



# నవంబర్ వచ్చేసింది..

నవంబర్ నెలలో 'SSMB 29' అప్‌డేట్ ఉంటుందని తెలిసిన నాటి నుంచి ఈ నెల కోసం సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురు చూశారు. ఎట్టకేలకు నవంబర్ వచ్చేసింది. విఖ్యాత దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన సినిమా అప్‌డేట్ ఎప్పుడిస్తారు? ఎలా ఇస్తారు? ఏం ప్రకటిస్తారు? మహేశ్‌బాబు ఫస్ట్‌లుక్ ఉంటుందా? టైటిల్ ఎనౌన్స్‌మెంట్ ఉంటుందా? ఇలా ఆడియన్స్‌లో వేయి ప్రశ్నలు. ఈ నేపథ్యంలోనే మహేశ్‌బాబు సైతం తన ఎక్స్ వేదికగా అప్‌డేట్ ఎప్పుడొస్తుందంటూ రాజమౌళిని నిలదీశారు. దీనికి జక్కన తనదైన శైలిలో స్పందించారు. ఈ మీట్‌లో కథానాయిక ప్రియాంక చోప్రా, నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా జాయినవ్వడంతో సంభాషణ సరదాగా సాగింది. 'నవంబర్ వచ్చేసింది.. అప్‌డేట్ ఎప్పుడు?' అని మహేశ్ అడిగితే.. 'అవునూ.. ఈ నెలలో ఏ సినిమాకు రివ్యూ ఇద్దామనుకుంటున్నావ్?' అంటూ మాట దాట వేశారు రాజమౌళి. 'మీ డ్రీమ్ ప్రాజెక్ట్ మహాభారతానికి రివ్యూ ఇవ్వాలనుకుంటున్నా..' అంటూ వెటకారంగా సమాధానమిచ్చిన మహేశ్.. 'నవంబర్‌లో అప్‌డేట్ అన్నారు. మాట నిలబెట్టుకోండి..' అంటూ రెట్టించారు. 'ఇప్పుడేకదా నవంబర్ మొదలైంది.. నెమ్మదిగా ఇద్దాం..' అన్నారు రాజమౌళి తాపీగా. దాంతో షాకైన మహేశ్.. 'నెమ్మదిగానా?.. ఎంత నెమ్మదిగా? 2030లోనా?' అన్నారు.. ఇలా వీరి సంభాషణ సాగింది. మధ్యలో ప్రియాంక, పృథ్వీరాజ్ కూడా జాయిన్ అవ్వడంతో మరింత సరదాగా ఈ సంభాషణ ముగిసింది. ఇదిలావుంటే.. ఈ నెల రెండోవారం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో 'SSMB 29'కి సంబంధించి, ఓ భారీ ఈవెంట్‌ను మేకర్స్ ప్లాన్ చేసినట్టు సమాచారం. ఆ వేడుకలోనే అప్‌డేట్‌ని కూడా విడుదల చేస్తారని తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనున్నదని వినికిడి.

# వరప్రసాద్‌గారి పోరాటాలు



మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్‌గారు'. అగ్ర హీరో చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో విక్టరీ వెంకటేశ్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాతలు. సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందం పాల్గొనగా..స్టైలిష్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని హైదరాబాద్‌లో ప్రారంభించారు. విజువల్ వండర్‌లా ఈ ఫైట్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ పర్యవేక్షణలో మెగా అభిమానులు సంబరాలు చేసుకునేలా ఈ ఫైట్‌ని డిజైన్ చేశారు దర్శకుడు అనిల్ రావిపూడి. చిరంజీవి చరిష్మా, గ్రేస్ ఈ సీక్వెన్స్‌లో తారాస్థాయిలో ఉంటాయని తెలుస్తున్నది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: శ్రీమతి అర్చన, నిర్మాణం: షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్.



# లేకపోతే అదే పని చేస్తాను..

బుల్లితెర యాంకరమ్మ విష్ణు ప్రియ. చిన్నప్పటి నుంచి తనకు ఆధ్యాత్మికం, సన్యాసం వైపు ఆలోచనలు ఉన్నాయని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విష్ణు ప్రియ మాట్లాడుతూ.. "నేను సన్యాసం తీసుకోవడానికి రెడీ.. నాకు నచ్చిన అబ్బాయి రాకపోతే వెళ్లిపోతాను. నేను గతంలోనే హరేరామ హరేకృష్ణ మూమెంట్ లోకి వెళ్లిపోదాం అనుకున్నాను. ఇప్పుడు బ్రహ్మ కుమారీస్, కాశీకి వెళ్లిపోదాం అనుకుంటున్నాను. చిన్నప్పటి నుంచి గీత ప్రెస్ ద్వారా భగవద్గీత ప్రచారంలో పాల్గొన్నాను. నాకు భగవద్గీత మొత్తం వచ్చు. చాలా శ్లోకాలు, దేవుడి పాటలు వచ్చు. ఇటీవల సద్గురు ఆశ్రమంకు వెళ్లి వచ్చాను. ఇంకో పదేళ్లు బాగానే ఉందని పంతులు గారు చెప్పారు. ఆ తర్వాత ఏమైనా జరిగితే కాశికి వెళ్లిపోతా.. " అని చెప్పుకొచ్చింది. "మూడు లవ్ స్టోరీస్ బ్రేకప్ అయ్యాయి. సెకండ్ బ్రేకప్ మర్చిపోవడానికి మూడేళ్లు కాశీ, పవిత్ర స్థలాలకు వెళ్లాను. చాలా టైమ్ పట్టింది. ఆ బ్రేకప్ నుంచి కోలుకోవడానికి చాలా టైమ్ పట్టింది. మెడిటేషన్ మీద ఫోకస్ చేస్తే మనల్ని మనం కంట్రోల్ లోకి తెచ్చుకుంటాం. గతంలో పాకెట్ మనీ కోసం భగవద్గీత చెప్పాను. సినిమాల్లోకి రాకపోతే అదే చేసేదాన్ని. చిన్నప్పటి నుంచి సన్యాసం వైపు వెళ్లాలనే ఆలోచనలు వచ్చేవి పదేళ్ల తర్వాత అవకాశాలు రాకపోయినా.. పెళ్లి కాకపోయినా సన్యాసం లోకి వెళ్లిపోతాను" అంటూ చెప్పుకొచ్చింది.



# సక్సెస్ ప్రాజెక్టులతో మెప్పించిన నార్త్ భామ

విజయం సాధించిన తర్వాత తదుపరి చిత్రాలకు కొంత విరామం తీసుకోవడం నటీమణులలో సాధారణం. అయితే, ఉత్తరాది నుంచి వచ్చి దక్షిణాది ప్రేక్షకులను మెప్పించిన కొందరు తారల విషయంలో ఈ విరామం అభిమానులలో ఆందోళన కలిగిస్తోంది. ఒక సినిమాతో అలరించి మళ్లీ కనిపించడానికి సమయం తీసుకుంటే, వారిని మిస్సయ్యామన్న భావన ప్రేక్షకులలో బలపడుతుంది. జాన్వీ కపూర్ దేవర పార్ట్ వన్తో సౌత్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రస్తుతం పెద్ది చిత్రంలో నటిస్తున్నారు. దేవర సీక్వెల్ కూడా ఆమె చేతిలో ఉంది. ఆమె హిందీ చిత్రాలు సౌత్‌లో పెద్దగా ప్రభావం చూపకపోవడంతో, తెలుగు ప్రేక్షకులు పెద్ది కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# జానీ మాస్టర్‌కి అవకాశాలు..

## అలాంటి వారిని ప్రోత్సహించడం తప్పు అంటూ చిన్మయి కామెంట్



సింగర్ చిన్మయి శ్రీపాద గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తన మధుర గాత్రంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆమె, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై నిర్భయంగా స్పందించే వ్యక్తిగా కూడా పేరు తెచ్చుకున్నారు. మహిళల హక్కుల విషయంలో తరచూ తన స్వరాన్ని వినిపిస్తూ చిన్మయి సోషల్ మీడియాలో చురుకుగా ఉంటారు. తాజాగా ఆమె చేసిన పోస్టు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, సింగర్ కార్తీక్ మళ్లీ సినిమాల్లో అవకాశాలు పొందుతున్న నేపథ్యంలో చిన్మయి తీవ్రంగా స్పందించారు. చిన్మయి తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో.. సింగర్ కార్తీక్, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌లాంటి వారిని మళ్లీ ఇండస్ట్రీలోకి తీసుకోవడం అంటే లైంగిక వేధింపులను ప్రోత్సహించినట్టే అవుతుంది.

అధికారం, డబ్బును దుర్వినియోగం చేసిన వారి చేతుల్లో మళ్లీ అవకాశాలు పెట్టడం సరికాదు. కర్మ సిద్ధాంతం నిజమైతే, అది ఎప్పటికీ వదిలిపెట్టదు అని రాసుకొచ్చింది.దీంతో ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, సింగర్ కార్తీక్ లైంగిక వేధింపుల ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో వారిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. జానీ మాస్టర్ కొంతకాలం జైలుకి వెళ్లి, తరువాత బెయిల్‌పై విడుదల అయ్యారు.

అనంతరం ఇద్దరూ ఇండస్ట్రీకి కొంతకాలం దూరమయ్యారు. అయితే ఇటీవల మళ్లీ తమ తమ ప్రొఫెషనల్ లైఫ్‌లో బిజీ అయ్యారు. ఈ క్రమంలో చిన్మయి సంచలన కామెంట్స్ చేసింది. చిన్మయి వ్యాఖ్యలపై నెటిజన్లు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తూ మద్దతు తెలుపుతుంటే, మరికొందరు ఆమెపై విమర్శలు చేస్తున్నారు. ఏది ఏమైనా, చిన్మయి మరోసారి తన నిర్భయ స్వరంతో "మీటూ" ఉద్యమాన్ని మళ్లీ గుర్తు చేసింది. అన్యాయం ఎక్కడ జరిగిన, దాన్ని ప్రశ్నించే స్వరం ఎప్పటికీ మౌనంగా ఉండకూడదు అని చిన్మయి శ్రీపాద స్పష్టం చేసింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**